


నా చెవులలో ఇంకా ఆ మాటలే మ్రోగుతూ ఉనావి. "వెళ్ళగానే ఏ హోటల్లోనో దిగి ముందుగా ఆదినారాయణ మూర్తిగారిని కలుసుకో. ఈ ఉత్తరం చూపించి వారు చెప్పినట్లు చెయ్యి." నేను హైదరాబాదు రావటానికని బస్సు ఎక్కి కూర్చున్నప్పుడు నాన్నగారు నాలుగో సారీ, ఆఖరు సారీ నాకు చేసిన హెచ్చరిక ఇది. అందువలననే అదే ధ్యేయంగా, గంట సేపటి నుంచి వెదుకుతున్నాను. అడ్రసు రాసిన చీటీ చేతిలో చమటకి తడిసి పోయింది. అన్నీ ఒకలాటి రకంగా కనబడే విశాలమయిన చక్కని రోడ్లు. ఎత్తయిన, ఖరీదయిన భవంతులు.

వెతికి వెతికి వేసారి పోయాను, చేతిలో అడ్రసు ఉండీన్నీ. వారి ఇల్లు కనబడేదాకా వెతక్క తప్పదు మరి. ఆ ఇంటి గేటు దగ్గర ఎవరూ లేరు. "కుక్కలున్నవి జాగ్రత్త!" అన్న బోర్డు కూడా లేదు. లోపల విశాలమయిన ఆవరణలో అందమయిన పూలమొక్కల మధ్యన పెద్ద భవనము. ధైర్యంగా లోపలికి అడుగు పెట్టాను.

"ఎవరు కావాలి?" అని నన్ను మధ్యలోనే ఆపి అడిగాడు ఒక కాకీ బట్టల మనిషి. బహుశా అతను ఏదో పిలుపు మీద లోపలికి వెళ్ళి ఉంటాడు, గేటు దగ్గర నుంచి.

వారి పేరు చెప్పాను. మొహము అదోలా పెట్టి వికృతంగా నవ్వాడు. "ఇది కాదు. అవతలేమో కనుక్కోండి." అని, ఇక దయచెయ్యమన్నట్లు చెయ్యి చూపి గేటు వైపుకి దారి తీశాడు.

"ఎవరదీ?" అంటూ కర్టెన్ దగ్గర్నుంచి సన్నని గొంతు వినిపించి అటు చూశాను. హాలు గుమ్మానికి కట్టిన 'కర్టెన్' తొలగించి వరండా లోనికి మొహం మాత్రము తొంగి చూస్తూ ఉంది. మెరుపు తీగ లాటి పిల్ల అని మొహం చూస్తేనే చెప్పవచ్చు. నోట మాట లేక అలాగే చూస్తూ ఉండి పోయాను. మరుక్షణం ఆ మొహం మాయమయింది. నా మెదడులో కలవరం చెలరేగింది.

ఆ అమ్మాయిని ఇది వరకు చూశానని అనిపించింది. కాని, ఎంత ప్రయత్నించినా ఆమె ఎవరో నా మెదడుకి తట్టనే లేదు. 'ఎవరు?' అన్న ప్రశ్న నా మనస్సుని పూర్తిగా ఆవరించుకుంది. ఎంత ఆలోచించీ, కృతకృత్యుడను కాలేక పోయాను. అప్పటికే నా వంక 'మిర్రి మిర్రి' చూస్తున్నాడు గేటు దగ్గర మనిషి. ప్రమాదం గ్రహించి రోడ్డు మీద పడ్డాను నిముషాలలో. ఆ గోడ మీద ఏమయినా పేరులాంటిది ఉందేమోనని చూశాను. కాని అలాంటిదేమీ నా కంటికి అనలేదు.

మరొక గంటకి ఆదినారాయణమూర్తి గారి ఇల్లు వెదకి చివరకు పట్టుకున్నాను. ఎంతో సంతోషమయింది. ఇంత సేపూ ఆ అమ్మాయి నా ఆలోచన్లని పూర్తిగా ఆక్రమించుకునే ఉంది. అందువలన నేమో నాకు మరి అంతగా అలసట అనిపించ లేదు.

నా అదృష్టం కొద్దీ ఆదినారాయణ మూర్తి గారు ఇంట్లోనే ఉన్నారు. నేను ఇచ్చిన ఉత్తరం బాగా పనిచేసింది. ఒకటి రెండు రోజులలో 'ఆర్డర్' చేతికి వచ్చేలా చేస్తానని ఆయన నాకు మాట ఇచ్చేరు. కాసేపు కూర్చుని కాఫీ తాగి వచ్చేశాను.

వచ్చిన పని సగం పూర్తయినట్లే. ఆదినారాయణ మూర్తి గారు మాట ఇచ్చేక ఇక భయానికి ఆస్కారము లేదు. ఆయనకి దేశములో చాలా చోట్ల అనేక కంపెనీలలో వాటా లున్నాయి. కొన్నిటికి ఆయనే యాజమాన్యము నిర్వహిస్తుంటారు. అంతటి మనిషి నన్ను, సాదరంగా మాట్లాడి, భరోసాతో పాటు కాఫీ కూడా ఇచ్చి, ఆదరించారంటే ఇదంతా నేను తెచ్చిన ఉత్తరం మహిమే గదా అనుకుని ప్రాణం లేని (?) ఆ ఉత్తరానికి ధన్యవాదాలు అర్పించుకున్నాను.

బయట పడ్డాక, తిరిగి రెక్కలు వచ్చిన పక్షిని అయ్యాను. భాగ్యనగరంలో రెండు రోజులు గడప వలెనని ముందే అనుకుని ఉండటము వలన, తీరిక లేని కార్యక్రమము ఇది వరకే ఏర్పాటు అయి వుంది నాకు.

కాని నన్ను ఒకే ఒక ప్రశ్న ప్రొద్దుటి నుంచీ వూపిరాడకుండా చేస్తున్నది.

ఆ ఇంట్లో మెరుపులా కనబడి, మొహం మాత్రమే చూపి మాయమయిన అమ్మాయిని నేను నిశ్చయంగా ఇది వరకు ఎరుగుదును. ఆమె ఎవరు? ఎవరు??

నాలుగు చోట్లా, సాయంత్రం దాకా తిరిగి ఆరు గంటల సినిమాకి వెళ్ళాను. నేను వెళ్ళే సరికే సినిమా మొదలయింది. 'ఇంటర్ వెల్' లో బయటికి వచ్చి సిగరెట్ కాల్చు కుంటూన్న నా బుజం మీద బరువయిన చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూశాను.

లావు పాటి మనిషి. ఉలిపిరి కాగితంలో చుట్టిన యాపిల్ పండులా ఉంది, ఖరీదయిన బట్టల్లో ఉన్న అతని శరీరము. నున్నగా పుష్టిగా ఉన్న మొహములో సన్నగా చిరునవ్వు. నాకు తెలిసిన చిరునవ్వు! అయోమయంగా చూస్తున్న నన్ను, "మరిచి పోయావేంరా?" అన్నాడు అతను, కుదుపుతూ.

అతను సీతారామరావేనా? అవును. లావెక్కడము వలన పోల్చుకో లేక పోయేను. మనిషి ఎర్ర బడ్డాడు. ఒళ్ళు మనువు దేలింది.

"నన్ను క్షమించరా. పోల్చుకో లేక పోయేను" అని వాడిని కావిలించు కున్నాను, చేతిలో సిగరెట్టు అవతలపారేసి.

"నీ మొహం లే" అంటూ నన్ను వదిలేసి ప్రశ్నలతో ముంచెత్తేడు. నేనూ అంతే. వాడిని చూసి ఏడేళ్ళు కావస్తున్నది. కాని వాడిలో, నన్ను ఆశ్చర్యంలో ముంచి వేసే విషయం ఒకటి చూశాను. ఆ సంగతి అడగటానికి నాకు నోరు రాలేదు, ఎంత సేపటికీ.

సీతారామరావు నాకు చిన్న నాటి స్నేహితుడు. ఆ కాసేపట్లోనే చాలా విషయాలు మాట్లాడు కున్నాం.

ఇంతలో 'సినిమా' మొదలవటము వలన లోపలికి వెళ్ళేము. కాని ఇక, మా దృష్టి 'సినిమా' మీద లేదు. మా గొడవలో మేము పడిపోయేము. విసుగుతో కూడిన ఛీత్కారము ప్రక్కనున్న ప్రేక్షకుల నుంచి వచ్చింది. అదీ ఆడ ప్రేక్షకుల నుంచి అవటము వలన నోళ్ళు మూసుకున్నాము బుద్ధిగా ఇద్దరమూ.

సినిమా అయింతరవాత 'లైట్లు' వెలిగేయి. సీతారామరావు ప్రక్కన మరో ఇద్దరు ఆడవాళ్ళు ఖరీదయిన దుస్తులలో ఉండటము అప్పుడు గమనించేను. అతను పరిచయం చేసేడు. ఒకామె అతని భార్య. రెండవ ఆమె!? ప్రొద్దున నేను చూసి, ఎవరా? అని జ్ఞాపకం తెచ్చుకోవటానికి నానా యాతన పడి, చివరికి మెదల కుండా వూరుకున్నది ఈ అమ్మాయిని గురించే అని తెలుసుకుని నా మతిమరుపుకి తిట్టుకున్నాను.

"మా మరదలు" అని పరిచయం చేశాడు. ఆ అమ్మాయి పేరు శ్యామలట. అవును ఆ అమ్మాయి నాకు ఇది వరకే తెలుసును.

దానికి కథ కొంత ఉన్నది.

అయితే ప్రొద్దున నేను చూసిన విశాలమయిన, ఖరీదయిన భవంతి ఎవరిది? ఎక్కడి సీతారామరావు? నేను ఆశ్చర్యపడుతూనే ఉన్నాను. నాచెయ్యి పట్టుకొని నడిపించుకుని వెళ్ళేడు సీతారామరావు, తన ఖరీదయిన కారు దగ్గరకు. "మొన్నే కొన్నాను. రా. నిన్ను 'డ్రాప్' చేస్తాను." అని లోపలికి లాగేడు. వెనక సీట్లోకి ఆడవాళ్ళు వెళ్ళేరు. వాడికి హొటలు పేరు చెప్పి మెరిసే 'టాంక్ బండ్' మీది లైట్ల వంక చూస్తూ ఉండి పోయేను.

కారు ఆగింది. "రేపు ప్రొద్దున వస్తాను" అని, నా రూము నంబరు కనుక్కున్నాడు. నా ఆలోచనల్లో నన్ను వదిలి 'గుడ్‌నైట్' చెప్పి వెళ్ళి పోయాడు సీతారామరావు వాళ్ళతో.

నాకు తెలిసిన ఏడేళ్ల కిందటి సీతారామరావుని వూహించుకుంటూ గది చేరు కున్నాను.

శ్యామల— సీతారామరావు— వాళ్ల మామ గారు— అతని భార్య నా మస్తిష్కంలో తిరుగుతూనే ఉన్నారు.

అవును. ఏడేళ్ల కిందటి సీతారామరావుకీ, ఇప్పుడు నేను చూస్తున్న సీతారామరావుకీ చాలా తేడా ఉంది. ఇతనే అతనా అన్న అనుమానమూ నాకు కలగక పోలేదు. మావూరు ఒకటే: నేనూ, సీతారామరావూ 'స్కూల్ ఫైనల్' దాకా కలిసి చదువు కున్నాము. అతను 'స్కూల్ ఫైనల్' రెండు సార్లు తప్పాడు. నేను 'ఇంటర్మీడియట్' పాసయేసరికి ఇంకా సీతారామరావు 'స్కూల్ ఫైనల్' పూర్తి చెయ్యనే లేదు. తరవాత నేను బి. ఏ. కి బందరు వెళ్లవలసి వచ్చింది.

సీతారామరావుకి తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయారు. అందువలన అతన్నీ, అతనికి మిగిల్చి పోయిన కొద్ది ఆస్తినీ వాళ్ళ మేనమామలు చూశారు. ఆ రోజుల్లోనే అతనికి పెళ్ళయిందని తెలిసింది.

ఆ తరువాత అతని గురించి కొన్నాళ్ళు నాకు ఏమీ తెలియ లేదు.

నేను బి. ఏ. చదువుతూ వుండగా ఒకసారి వేసవి సెలవులలో మా మామయ్యగారి వూరు వెళ్లాను. అక్కడ ఉన్నన్నాళ్ళూ నాకు ఏమీ తోచేది గాదు. వేళకి ఇంత తిని తోటల వెంటా, పొలం గట్ల వెంటా తిరుగుతూ ఉండే వాడిని. పంట కాలవల పక్కన ఎత్తయిన తాటి చెట్లూ, మామిడి చెట్లూ పట్టుకు తిరగటం, కాసేపు కాలవలో ఈత కొట్టడము, 'బోర్' కొట్టినప్పుడు గొంగెత్తి బిగ్గరిగా పాటలు పాడటం చేసే వాణ్ణి. ఒక్కొసారి నా ఈ చేష్టలు గమనించి ఎవరైనా నవ్వుకొనటము చూసి కంగారుపడి సిగ్గు పడే వాడిని.

ఒకసారి అట్లా తిరుగుతూ ఉన్న నేను, సాయంత్రపు నీరెండలో, మామిడి చెట్టు నీడన, కాలవ గట్టు మీదు తల కింద చెయ్యి పెట్టుకుని పడుకుని కూనిరాగం తీస్తున్న ఒక మనిషిని గమనించాను. తెల్లని బట్టలు, అతని కూనిరాగం, నా ఒంటరి తనం నన్ను అతని దగ్గరకు వెళ్ళేలా చేశాయి. దగ్గరకు వెళ్ళి చూసి ఆశ్చర్య పోయాను.

అతను సీతారామరావు. అతుకులు ఉన్నా అతని బట్టలు, శుభ్రంగా ఉన్నాయి. నన్ను చూసి నవ్వి కావిలించు కున్నాడు ఆనందంతో. సీతారామరావు అత్తవారి వూరు అదేనట! "ఏం చేస్తున్నావ"ని అడిగేను. "ఉద్యోగం ఇచ్చే వాళ్ళు లేరు. నానా కష్టమూ పడి 'స్కూల్‌ఫైనల్' పూర్తి చేశాను. వ్యవసాయం చెయ్యటం చాత కాదు. ప్రస్తుతం తినటం తిరగటం తప్ప వేరే పని లేదు." అని నవ్వాడు. ఆ నవ్వు వెలితిగా కనబడింది నాకు. ఆ రోజు నుంచి ఇద్దరం కలిసి తిరిగే వాళ్లము, జంటగా తోపులలో.

అతని మాటల వెనక అగాధం, నవ్వులో వెలితీ ఉన్నట్టని పించేది నాకు.

ఆ నాడు బాగా పొద్దు పోయింది, మేము వూళ్ళోకి వెళ్ళేప్పటికి. అతన్ని ఇంటి వద్ద దిగబెట్టాను దారి లోనే అవటం మూలాన వాళ్ల ఇల్లు. నిశాచరుల్లాగా వెడుతున్న మేము కటిక చీకటిలో తెల్ల తెల్లగా ఉన్నాము.


సొగసైన
కురులు
రీటా
ఎప్పుగా, అందంగా జుట్టును పెంచుతుంది

ఒకరి శిరోజ సౌందర్యంచూచి
మరొకరు ఇక ఎంతమాత్రం
అసూయపడవలసిన అవసరం
లేదు. రీటా వాడి మీ కురుల
సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.


ఏటో కంపెనీ, మద్రాసు 1
R-22.76



సూరేడుకాయలు
మొటిమలు


నికో సబ్బు మీ చర్మమును మొటిమలు,
సూరేడుకాయల బారినుండి రక్షణ
కలిగిస్తుంది నికో సబ్బు రుద్దు కొని
స్నానముచేస్తే అది శరీర దుర్గంధము
లేకుండాచేస్తుంది.
నికో
క్రిమిసంహారక సబ్బు
పార్కు-డేవిస్ ఉత్పత్తి
MAS 6515 b


# బంధితుడు

వాళ్ల మామ గారు గాబోలు అంటున్నారు "ఇంకా దొరగారు రాలేదా?' అని. ఆ మాటలు విన నట్టుగా, నాకు వీడ్కోలు చెప్పి అతను లోపలికి వెళ్లిపోయాడు వెళ్లటానికి నాలుగడుగులు వేసిన నాకు, అతని మామగారి మాటలు వినిపించేయి. "ఏం బాబూ! దమ్మిడీ పని లేక పోయినా, ఇంత పొద్దు పోయే దాకా రాచకార్యాలు అవలేదా? ఇంటి దగ్గర మనుషుల్ని కంగారు పెట్టడ మెందుకయ్యా పనీ పాటా లేని వాళ్లు కూడా. ఎవరా మనిషి?" అని. సీతా రామారావు మెల్లగా ఏదో చెబుతున్నాడు.

నాకు సిగ్గు వేసింది. గబ గబా నడిచి వెళ్లి పోయాను.

సీతారామరావు జీవితం ఇట్లా అయిందన్న మాట చివరికి. సంపాదన లేని పురుషుడికి ఇంట్లో ఇచ్చే గౌరవం నాకు తెలియంది కాదు. అలిగి అత్తవారి ఇంటికీ, చెడి చెల్లెలు ఇంటికీ వెళ్లకూడ దంటారు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోక పోయినా ఉన్న మాట అది. అట్లాంటిది సీతారామరావు ఇలా విలువ లేని జీవితం గడుపుతూ అత్తవారినే పట్టుకుని ఎందుకు వేళ్లాడుతున్నాడో నాకు అర్థం కాలేదు. ఎవరు ఉండవలసిన చోట వారు ఉంటేనే ఆదర్శాలూ, స్నేహాలూ, బంధుత్వాలూను. ఈ సంగతి సీతారామరావుకి తెలియదా?

అదే అడిగేను అతన్ని మర్నాడు. "మన వూరికి వచ్చేసి నీ ఇంట్లోనే ఉండి పోగూడదా?" అన్నాను. అతను నవ్వి అన్నాడు. "ఇవన్నీ నాకు తెలీక కాదు. నా పెళ్లయి నప్పటి నుంచీ మా మేన మామలకీ మా అత్త వారికీ చెడింది. ఒకళ్లంటే ఇంకొకరికి మంట. అందుకని ఆ వూళ్లో తన కూతురు కాపురం చెయ్యటం మా అత్త గారికి ఇష్టం లేదు. ఏదైనా ఉద్యోగం చూసుకోమంటారు వీళ్లు. అప్పుడే వాళ్ల అమ్మాయిని కాపరానికి పంపిస్తారట. ఈ సమస్య ఇట్లా కొన్నాళ్లు నలిగింది. అది ఇక్కడా, నేను అక్కడా బాధ పడటం నాకు ఇష్టం లేక పోయింది. ఎంత ప్రయత్నం చేసినా ఉద్యోగం దొరకలేదు. 'ఎస్. ఎస్. ఎల్. సీ.' కి సిఫారసు లేకుండా ఈ రోజుల్లోఏమి ఉద్యోగం దొరుకుతుంది ? అందుచేత, నా మకామే, మార్చేశాను. మొదట్లో బాగానే చూశారు. కాని రోజులు గడచిన కొద్దీ కృష్ణ పక్షపు చంద్రుడులాగ ఆ గౌరవమూ ఆవిరయి పోయింది.

ఇక వేరే దారిలేదు. అందుకని ఒక 'పాలసీ'ని నిర్ణయించుకున్నాను. అయిం దేదో అయింది. అన్నింటికీ చెడ్డాను. ఇంక లెక్క ఏమిటి? నాకు. మొండివాడు రాజు కంటె గొప్పవాడన్నారు.

అల్లుడు, కడు స్వతంత్రుడు అన్నాడు. నా బలహీనత ఏమంటే మా వాళ్లను విడిచి ఉండలేకపోతున్నాను. ఇప్పుడు నేనూ వాళ్లలో ఒకణ్ణి అయిపోయాను. పెద్దవాళ్లు మతి చాంచల్యంతో ఏవో అంటారు. మనము అవన్నీ పట్టించుకుంటే ఎట్లా? సర్దుబాటు ఏదో ఒక వైపు నుంచైనా ఉండాలి గదా!"

ఆశ్చర్యంతో అతన్ని చూస్తూ ఉండిపోయేను. అతను, ఆ సాయంత్రము నన్ను వాళ్ల ఇంటికి తీసుకుపోయాడు. వాళ్ల మామగారు నన్ను గుచ్చి గుచ్చి చూసి యక్ష ప్రశ్నలు వేసేరు. నాకు చమటలు పట్టినంత పనయింది. దీర్ఘమూ, ఉన్నతమూ అయిన కాయముతో బుంగమీసాలు కదుపుతూ ఆయన అడిగే ప్రశ్నలూ, చూసే చూపులూ నన్ను ఇబ్బంది పెట్టాయి.

"ఉద్యోగం చేస్తున్నావా?" అని అడిగేరు ఆఖర్న. లేదని తలాడించేను. నిరసనగా నా వేపు చూసి పైపంచ దులిపి అవతలికి వెళ్లిపోయే రాయన. నాకు సంతోషమైంది. తేలిగ్గా ఊపిరి పీల్చేను. బంధం వొదిలి పోయినందుకు.

నేను కూర్చుని ఉండగానే, "ఇప్పుడే వస్తా"నని చెప్పి భార్యతో మాట్లాడటానికి లోనికి వెళ్లేడు సీతారామరావు. యధాలాపంగా తలతిప్పి దొడ్లోకి చూసిన నేను ఆశ్చర్యంతో, ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. నా కన్నులకు విందు అయినది!

మెరుపు తీగలాటి ఒక అందాల బాలిక పూలుకోసుకుంటూ ఉన్నది. ఆమె నన్ను గమనించనే లేదు. పసిమి పచ్చని బంగారు ఛాయ. చంపకు చారడేసి కళ్ళు. అందమైన సన్నని ఎర్రని పెదిమలు. అద్భుతమయిన అందంతో మెరిసిపోతున్నది ఆ అమ్మాయి. అంత అందం నేను ఎప్పుడూ చూడలేదు.

తరవాత సీతారామరావు వచ్చాడు. ఆ అమ్మాయిని చూపించి ఎవరని అడిగేను

"ఏం?" అని కొంటెగా నవ్వి, "మా మరదలు. శ్యామల." అన్నాడు. అప్పటినుంచీ నా మనసంతా ఆ అమ్మాయే ఆక్రమించేసింది. మనసులో మథనపడ్డాను. నిద్రలేని రాత్రులు గడిపాను. వోడిపోయాను. ఒకటి రెండు రోజులలో నేను ఆవూరు వొదిలి వెళ్ళిపోతానగా, ఇక ఆగలేకపోయాను. "నువ్వు ఏమీ అనుకోనంటే ఒక టడుగుతాను సీతా రామారావు!" అన్నాను. నా వంక కుతూహలంగా, ఆశ్చర్యంగా చూశాడు. "మీ శ్యామలని నాకు ఇచ్చి పెళ్ళి చెయ్యటానికి మీ వాళ్ళకేమయినా అభ్యంతరం ఉంటుందా?" అన్నాను నోరు పెగల్చుకుని. సీతారామారావు నా బుజం చరిచి పగలబడి నవ్వాడు. "వోరి నీ! ఇదా నువ్వడిగేది?" అని వెక్కిరించాడు. నాకు సిగ్గేసింది వాడి మీద కోపం వచ్చింది. "సీరియస్‌గా అడుగుతున్నాను. నవ్వుతా వెందుకు?" అన్నాను కోపం తెచ్చుకుని.

"ఈమాత్రం దానికి అంత ఇదెందుకు? మన చేతులలో పనే గదా! నేనే ఆయన్ని కదలేస్తాను. నిన్నూ, నీ ఆస్తినీ చూసి ఇవ్వక ఏం చేస్తారురా పిచ్చివాడా!" అన్నాడు. "నేను రెండురోజులలో వెళ్ళిపోతున్నాను. నువ్వు ఇవాళే ఈ విషయం కదిపి, సరే ననిపిస్తే, తరవాత ఆయన్ని మా వాళ్ళ దగ్గరికి పంపవచ్చు. వీళ్ళు సరేనంటే ఈలోగా నేను మా వాళ్ళని దారికి తీసుకు రావటానికి వల వేస్తాను." అన్నాను.

"వో యస్. 'అల్లుడు కడు స్వతంత్రుడు' అన్నారుగా? ఇవాళే మాట్లాడతాను. వాళ్ళకీ ఇష్టమే అనిపించి నీ కోరిక నెరవేరుస్తాను." అన్నాడు. నాకు చాల సంతోషమయింది. వాడిని మెచ్చుకున్నాను.

ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు కలలలోకి శ్యామల వచ్చి అల్లరి చేసింది. మర్నాడు సీతారామారావు నాకు కనబడి, నప్పుడు ఆముదం మొహాము పెట్టాడు "మిగతా విషయాలు ఎట్లా ఉన్నా వాళ్ళ' 'చదువుకున్న నిరుద్యోగి'కి శ్యామలని ఇవ్వరట. ఈ విషయం వాళ్ళకి ఎంతగానో నచ్చ చెప్పటానికి ప్రయత్నించాను. 'ససేమిరా' అన్నారు. అందులో నువ్వు నా స్నేహితుడవటం వలన మా మామగారు మొదట్లోనే కొట్టి పారేశారు. 'నువ్వు ఒకడివి ఉన్నావు. చాలు. ఇంకా నీకు జత ఎందుకు?' అన్నారు. నా వలన కాలేదు బ్రదర్" అని ముక్కు చీదుకున్నాడు విచారపడి.




# నిరాల

## వేరు మాదిరి ఒక ఉతికే సబ్బు

వేరు మాదిరి రూపము: నిరాల సబ్బుతో ఉతికిన బట్టలు వేరు మాదిరిగా కనబడతాయి — తెల్లటి బట్టలు ఎక్కువ తెల్లగాను, రంగు బట్టలు ఎక్కువ ఉజ్వలంగాను వుంటాయి!

వేరు మాదిరి పని: వాడి చూడండి, దాని ప్రభావము! నిరాల అత్యుత్తమంగాను, త్వరగాను ఉతుకుతుంది. మురికిని పూర్తిగా తొలగిస్తుంది.

వేరు మాదిరి ధర: నిరాల యొక్క సమృద్ధయిన నురగ అంత సబ్బుతోనే ఎక్కువ బట్టలను ఉతుకును. నిజంగా మీరు సొమ్మును మిగుల్చుకో గలరు!

నిరాల — వేరు మాదిరి సబ్బు.
దానిలో జంతువుల క్రొవ్వు లేదు.




ASP/N-7 TEL.

తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్, కర్నూలు.

పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

సలహా
క్షీణోయిన ఆనందం, బలం, శక్తిని తిరిగి యిచ్చేందుకు అపూర్వదకరమైనది. నరాల బలంకు పైపూతకు వాడే తైలం. 1 సీసా రు 11-50 స్పెషల్ రకం అర్జంటు గుణంకు రు. 27/- ఎడ్వాన్సు పంపుతూ జవాబుకు కవరు పంపాలి.
డాక్టర్ రత్నం సన్స్,
Sex Specialists (Estd 1904)
ఆజంపురామార్కెట్ వద్ద, మలకపేట బిల్డింగ్స్
హైదరాబాద్-36 (ఆంధ్రప్రదేశ్)




# బంధితుడు

నా ఆశలు మొదట్లోనే తుంచివేయబడ్డాయి. అవమానంతో వాడి మొహంలోనికి సరిగా చూడలేకపోయాను. ఆ మర్నాడే ఆ వూరు వొదిలి వొచ్చేశాను. తిరిగి ఆవూరి మొహం చూడలేదు. ఎవరెంత బలవంతం చేసినా.

అప్పట్నించీ తిరిగి సీతారామారావు సంగతి తెలియలేదు. ఆనాటి ఆ సీతారామారావు తిరిగి ఈ రూపంలో కనబడేసరికి నాకు ఆశ్చర్యం కలిగిందంటే అసహజత్వం ఏమీ లేదు గదా!

ఈ ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. ఏ వొంటి గంటకో నిద్రపట్టింది. మర్నాడు ఉదయం ఏడు గంటలకే తలుపు దబదబా కొట్టాడు, హోటలు కుర్రాడు. "మీ కోసం ఎవరో వచ్చారంటూ. ఎదురుగా నవ్వుతూ సీతారామారావు కనబడ్డాడు. పైనుంచి కిందవరకూ అన్నీ ఖరీదయినవి ధరించి ఉన్నాడు. అతన్ని గాభరాగా లోపలికి రమ్మని పిల్చుకు వెళ్లేను. "తొందరగా, కానీ. పనుంది." అన్నాడు కూర్చుంటూ. ఒక అర గంటలో అన్నీ ముగించేను. కింద అతని కారు ఉన్నది.

"ఎక్కడికి?" అని అడిగాను, స్టీరింగు తిప్పుతున్న అతని చేతుల వొంక చూస్తూ, చిన్నగా నవ్వాడు. కారు పరుగెత్తింది. నా ఆశ్చర్యము వాడు, గమనించాడు కాబోలు అన్నీ వివరంగా చెప్పాడు. 'సిరిదా వచ్చిన వచ్చును సలిలంబులు నారికేళ ఫలముక్రియ భంగిన్' అంటూ మొదలుపెట్టి.

ఆ పల్లెటూళ్లో, అత్తవారింట విలువ లేని నిరుద్యోగిగా, సోమరిపోతు అల్లుడుగా మరో ఏడాది గడిపేడట. కొన్నాళ్లకి తిక్క వచ్చి మా వూళ్లో తనకి మిగిలి వున్న ఆస్తిపాస్తులు అన్నీ అమ్మేశాడట. ఓ పది వేలు చేత్తో పట్టుకుని ఝామ్మని హైదరాబాదు వచ్చేశాడట. ఆ పదివేలూ పెట్టి దొరికినన్ని స్థలాలు చవగ్గా కొనేశాడట! ఐదేళ్లలో వాటి ధరలు ఎంతగానో పెరిగిపోయి చూస్తూ ఉండగానే 'లక్షలు' వచ్చిపడ్డాయిట. ఇక ఆ వ్యాపారము తన తాహతుకి తగదని, అదంతా రకరకాల 'బిజినెస్సుల'లో పెట్టాడట. మూడు పువ్వులూ ఆరు కాయలుగా ఆ వ్యాపారాలన్నీ పెరిగేయట. ఇప్పుడు అతనికి నాలుగు, మేడలూ, ఒక సినిమా హాలూ, మూడు పెద్దపెద్ద పరిశ్రమలలో వాటాలూనట! ఈమధ్యనే నలభైవేలు పోసి ఈ కారు కొన్నారట!

"ఇదీ బ్రదర్! నా చరిత్ర" అని నవ్వాడు సీతారామారావు. ఆ రోజుల్లో అతను వెలితిగా నవ్వేవాడు. కానీ ఈ నవ్వులోనూ ఎంతో వెలితి ఉన్నట్టు కనబడింది నాకు. ఎందుకు?

"ఇంతకీ ఇప్పుడెక్కడికి, మనము వెళ్ళడము?" అని అడిగేను. "ప్రస్తుతము తిన్నగా మా ఇంటికి. తరవాత నీ ఇష్టం" అన్నాడు సీతారామారావు.

నా మనస్సులో ఇంకా కొన్ని సందేహాలు మిగిలిపోయేయి. మరో అయిదు నిముషాలలో గమ్యస్థానం చేరేము. గేటు కాపలావాడు నన్ను చూసి తెల్ల మొహం వేసేడు. నాకు నవ్వు వచ్చింది.

హాలులోకి వెళ్లేటప్పటికి, సిల్కు లాల్చీలో మునిగి, మెడలో బంగారు గొలుసుతో విశ్రాంతిగా కూర్చుని, చుట్ట కాల్చుకుంటూన్న ఒక భారీ విగ్రహాన్ని చూసి అదిరిపడ్డాను నేను. నా సందేహం వొదిలిపోయింది.

"రండి. రండి" అని ఆహ్వానించేడాయన నవ్వుతూ. నిదానంగా మాట్లాడేడాయన నాతో. ఎన్నాళ్ళగానో తెలిసిన మనిషిలా ప్రవర్తించాడాయన. లోపల నుంచి గాజుల గలగలలు వినిపించేయి. ముసలాయనలో అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు!

ఆయన నన్ను చాలా చాలా విషయాలు అడిగేడు. ఉద్యోగ వివరాలూ అవీ విచారించాడు. నేను ప్రయత్నిస్తున్న ఉద్యోగం గురించి విని సంతోషం ప్రకటించాడు. లోపల్నించి కాఫీలూ అవీ వచ్చాయి. అప్పటికి సీతారామారావు బయటికి ఊడిపడ్డాడు.

కాసేపు మాట్లాడిన తరవాత సీతారామారావుతో కలిసి బయటపడ్డాను. నన్ను ఆదినారాయణ మూర్తిగారి ఇంటి దగ్గర దించి నాతో అవసరంగా మాట్లాడాలనీ, సాయంత్రము నాలుగు గంటలకి తను వస్తాననీ, కనుక నన్ను గదిలోనే ఉండమనీ చెప్పి సీతారామారావు వెళ్లిపోయాడు.

ఆదినారాయణమూర్తి గారు ఇంటిలోనే ఉన్నారు. నేను వెళ్లగానే పదినిముషాలలో నా చేతికి 'ఆర్డర్సు' వచ్చాయి. మరునటి రోజే నేను ఉద్యోగంలో చేరాలని చెప్పారాయన. ఆయనకి కృతజ్ఞత చెప్పి బయటికి వచ్చాను సంతోషంగా. హోటల్‌కి వెళ్లి సామాను సర్దేశాను. నాలుగ్గంటల

దాకా ఇష్టము వచ్చినట్టు ఊరంతా తిరిగి చూశాను. ఆవాళే నేను వెళ్లిపోవాలి.

ఆ సాయంత్రము నాలుగు గంటలికి చెప్పినట్టుగానే, సీతారామరావు వచ్చాడు. కాఫీలు తాగి 'టాంక్ బండ్' వైపు వెళ్లేము అతని కారులో. అప్పుడు మొదలెట్టేడతను. "నువ్వేమీ అనుకోకుండా ఉంటే ఒక సంగతి చెప్తానురా" అని నా వంక చూశాడు. చెప్పమన్నట్టు తలాడించేను నవ్వుతూ. "నీ కోరిక మీద ఆనాడు నేను అడిగితే వాళ్లు అంత ఇదిగా నిరాకరించేరు. ఇన్నాళ్లనుంచీ ఎన్నో సంబంధాలు చూస్తూనే ఉన్నాము గాని, ఏదీ కుదరలేదు. ఒకటి సరిగా ఉంటే ఇంకోకటి బాగా ఉండటం లేదుట! అందులో ఈ ఆడవాళ్లని గొంతెమ్మ కోరికలు గదా!" అని ఆగాడు. నేను నవ్వాను. "కాని ఇన్నాళ్ల తరవాత మా వాళ్లందరూ ఎంతో కష్టపడి ఏకగ్రీవాభిప్రాయానికి వచ్చారు. ఇది నిజంగా గొప్పసంగతి. నిన్ను చూశాక ఇప్పుడు మా వాళ్లకి, మా శ్యామలని నీకు ఇచ్చి పెళ్లి చేద్దామని ఉద్దేశ్యం కలిగింది. అయితే ముందు నీవు వొప్పుకోవాలిగదా! అప్పుడు అంతగొడవ జరిందాయెను. నువ్వు "ఊఁ' అంటే నేను మీ వాళ్ళని కలుసుకుని మాట్లాడతాను. ఈ విధంగానయినా మనము దగ్గరవాళ్ళను అవొచ్చు. ఏమంటావు?" అంటూ తన చేతిలో ఉన్న నా చేతిని ఆదర పూర్వకంగా నిమిరేడతను.

నాకు ఆశ్చర్యమూ, ఆనందమూ, ఒక్కసారిగా కలిగేయి! ఉక్కిరిబిక్కిరి అయి పోయేను!!

"అంతా బాగానే ఉందిరా. ఆనాడు అవమానం జరిగిందని నేనేమీ మనసులో పెట్టుగోవటం లేదు. కాని, ఇప్పుడు పరిస్థితి నా చేతిలోలేదు. అంతా అయి పోయింది." అన్నాను.

"అదేమిటో నాకు చెప్పు. నేను ప్రయత్నిస్తాను." అన్నాడు.

"చెబుతాను, తప్పకుండా. ముందు నాకు ట్రెయినుకి టయిమవుతున్నది. రేపే బెజవాడలో ఉద్యోగంలో జాయినవాలి." అని తొందర పెట్టి వాడ్ని లేవదీశాను. వాడి మొహం తెల్లబోవటము నేను గమనించాను. హోటల్లో సామాన్లు తీసుకున్నాము. దారిలోనే గదా, కాఫీ తాగి పోదాము అని బలవంతం చేసి ఇంట్లోకి తీసుకపోయేడు నన్ను 'నేను కారులో 'డ్రాప్' చేస్తాను గదా!' అంటూ.

అతని మామగారు ఎంతో ఆదరంగా పలకరించేడు, హాలులో ఎదురు పడి, మొహం నిండుగా నవ్వుతూ. కాసేపటికి లోపలి నుండి ఊడిపడి సీతారామారావు, వచ్చి నా ప్రక్కన కూర్చున్నాడు. కాఫీ, ఫలహారాలు పట్టుకుని, సీతారామారావు భార్యా, శ్యామలా, వచ్చారు. నేను 'టయిమ'యి పోతుందని తొందరపడటము గమనించిన ముసలాయన "ఇంకా అరగంట టయిముంది. మన కారులో అబ్బాయి వచ్చి దిగబెడతాడు. ఫరవా లేదు." అని నవ్వాడు. నేను తేలిగ్గా ఊపిరి పీల్చాను.

నాకు నమస్కారాలు చేసిన ఆడవాళ్లకి నేను సిగ్గుతో చేతులు కలిపి ప్రతినమస్కారం చేశాను. కాఫీలయ్యేయి. ఆఖర్న ముసలాయనే విషయం కదిపేడు సూటిగా.

"మా శ్యామలని మీకిద్దామనుకుంటున్నాము. మీకు అభ్యంతరం లేకపోతే, మిగతా విషయాలు మీ వాళ్లతో మేము మాట్లాడుతాము" అని. ఇక లాభంలేదు. వీళ్లు అందరూ కలిసి నిలబెట్టేశారు.


## ఒక తరం కధ

ఈ నాడు మనం నివసిస్తున్న యీ కాలం చరిత్రలో అత్యంత ప్రధానమైనది. నేడు భారత దేశం ఆదర్శవంతమైన అభ్యుదయ పథంలో అతివడిగా పురోగమిస్తున్నది. ఎదురవుతున్న అనేక జాతీయ, అంతర్జాతీయ సమస్యల్ని అధిగమించి ప్రగతిలోకి ప్రయాణిస్తున్నాం మనం. మనం చేస్తున్న ఈ మహా యాత్ర యొక్క సమగ్ర స్వరూపాన్ని తెలుసుకోవాలంటే

సమాచార పౌర సంబంధ శాఖ ప్రచురిస్తున్న

# ఆంధ్రప్రదేశ్

సచిత్ర మాస పత్రిక

చదవండి.

ప్రతినెలా 72,000 కాపీలు అమ్ముడవుతున్నాయి. విడి ప్రతి వెల 30 పైసలు.

సమాచార, పౌర సంబంధ శాఖ
ఆంధ్రప్రదేశ్.

టి. రామచంద్రరావు,
డైరెక్టరు.

తగించి ఉన్నమాట చెప్పక తప్పదు ఇకనైయినా. లేకుంటే పాపం మూటగట్టుకున్నా వాడినవు తాను. "మీ అందరిలో ఆ అభిప్రాయం కలిగించినందుకు క్షంతవ్యుణ్ణి. మీ ఆదరాభిమానాలకి నేను ఎంతో కృతజ్ఞుణ్ణి.

# బంధితుడు

సీతారామారావుకి చెప్పాల్సిన అవసరం లేదను కోండి. ఇంతకీ, విషయమేమిటంటే, నాకు పెళ్లయి ఏడాదయింది. ఒక పసిపిల్లాడికి తండ్రిని కూడాను." అని నాటకంలో లాగ ఉన్నమాట అని, మొహాన పట్టిన చమటని 'కర్చీఫ్'తో తుడుచుకున్నాను.

అందరి మొహాలూ వెలవెలపోయేయి.. ఆడవాళ్లు లోపలికి వెళ్లిపోయేరు. వాళ్లతో బాటు సీతారామారావూను. "మరి నాకు సెలవిప్పించాలి తమరు." అన్న నా మాటలకి ముసలాయన వంచిన తలని ఎత్తకుండానే అటూ ఇటూ ఊపేడు. నేను 'సూట్ కేసు' పట్టుకొని బయటికి వచ్చాను. సీతారామారావు నాతో పాటు బయటికి వచ్చాడు. గేటు దగ్గర నిలబడి అటు పోతూన్న 'టాక్సీ'ని కేకేశాడు. షెడ్డులో అతని కారు కనబడుతూనే ఉంది. కారులో దిగబెడతాడేమోనను కుంటున్న నేను ఆశ్చర్యపడక తప్పలేదు, ఇది చూసి. ఇద్దరమూ టాక్సీలోకి ఎక్కాం. తిరిగి ఆ మేడ వైపు చూడటానికి నేను సాహసించలేదు. నన్ను రైలెక్కించి, చెయ్యి వూపుతూ ఉన్న సీతారామారావు కళ్లలో చిప్పిలిన ఒకటిరెండు కన్నీటి బొట్లు చూసి విచలితుడనయ్యాను.

ఏదో పోగొట్టుకున్నట్లు బాధగా ఉంది వాడి మొహము.

సంపాదనాపరుడై, ఐశ్వర్యంలో మునిగి తేలుతూ ఉన్న సీతారామరావు దేనికోసము బాధపడుతూ ఉన్నాడో నాకు అప్పుడు తట్టలేదు.

ఒకొకప్పుడు, విపరీతమయిన ఆరాధనా భావమూ, సర్వమూ సమర్పించుకోగలిగిన, అనురాగమూ అవి ఎంత ఉన్నతమైనవయినప్పటికిన్నీ, సరైన గుర్తింపు లేకపోతే పరిణామాలు విపరీతంగా ఉంటాయి. అలాగని భార్యని ప్రేమించి ఆరాధించటం తప్పని నా అభిప్రాయం కాదు. నా దృష్టిలో నిజంగా అదొక అదృష్టము. కాని మితము లేకపోతే వెగటు అనిపిస్తుందేమో, ఏదయినా. నిజంగా,ధాష్టీకం చలాయించకపోతే మగవాడికి విలువ ఉండదేమో?

నా స్నేహితుడు సీతారామరావుని, అతని ఆరాధనాభావమే, భార్య ఎడల అతనికి గల అపరిమితమయిన ప్రేమభావమే బంధముగా మారి బానిసను చేసినదా? ఏది ఏమయినప్పటికిన్నీ, ఆ నాటికీ ఈ నాటికీ కూడా, ఆ ఇంట్లో నా స్నేహితుడు సీతారామరావుకి గల స్థానములో కించిత్తయినా వ్యత్యాసము, నాకు ఎంత జాగ్రత్తగా చూపినా, కనబడలేదు... ●


